# ప్రస్తావన

*యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాగ్ంశ్చ ప్రహిణోతి తస్మై।*
*తంహ దేవమాత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥*

ఏ పరమాత్మ ముందుగా బ్రహ్మను సృజించి ఆతనికి వేదముల నన్నిటిని అందజేసియున్నాడో ఆత్మ బుద్ధిప్రకాశకరుడైన యీదేవుని ముముక్షువునైన నేను శరణుజొచ్చుచున్నాను.

శ్రీప్రకాశానంద స్వామివారికిని, శ్రీనిత్యానంద స్వామివారికిని ప్రసంగవశమున జరిగిన వినోదకరములైన సంభాషణలను 'వార్తాలాప' మను ఈచిన్న పుస్తకరూపమున ప్రకటించు భాగ్యాతిశయము మాకు లభించినందులకు ధన్యులము.

సమానశీల వ్యసనేషు సఖ్యమ్:— ఈమహాత్ములిద్దరి స్వభావములు, అలవాట్లు సమానములైనందున వీరు పరస్పరము స్నేహభావముతో నుండెడివారు. అంతేకాదు. ఒకరినొకరు గౌరవించుకొనెడివారు.

శ్రీ నిత్యానందస్వామివారు శరీరత్యాగము చేసిన తరువాత పదునారవ రోజున ఉభయస్వాములవారి భక్తులందరు 'పీరడియా' గ్రామమున సమావేశమైరి. వారందరు శ్రీ ప్రకాశానంద స్వామివారిని ఇట్లు ప్రార్థించిరి:— "తమ ఇరువురిమధ్య జరిగిన సంభాషణలను ఆధారముగా తీసికొని తమరు ఏదైనా వ్రాసినచో బాగుండును. మాకు చాలా లాభదాయకముగా నుండును."

అంతట శ్రీ ప్రకాశానందస్వామివా రిట్లు పలికిరి:—"ప్రపంచములో శ్రుతులు స్మృతులు మున్నగు శాస్త్రములు అనేకము లుండనే

ఉన్నవి. వాటివైపు చూచేవాడెవడు లేడు. ఇక నావంటివాడు వ్రాసి నచో ఉపయోగ మేముండును? పైగా శ్రీనిత్యానందస్వామివారు మాటలోను, చేతలోను ఎట్టి భేదములేకుండా నుండేవారు. సత్సంప్రదాయములను పాటించుచు వివేకముతో మాట్లాడేవారు. నేనైతే దారితెన్ను లేని సన్యాసిని. నావెర్రికి ఎట్లు తోస్తే అట్లు వాగేవాడను. అది మీకు అసహ్యముగాకూడ నుండును.''

ఇది విని వారంతా ఇట్లు పలికిరి:—"తమరేమిచెప్పినా శాస్త్ర సమ్మతముగానే ఉండును. శాస్త్రవిరుద్ధమును తమరు చెప్పనే చెప్పరు కదా!''

స్వా॥ ప్ర—"శాస్త్రములోలేనిదానిని క్రొత్తగా తెచ్చి యేమి చెప్ప గలను? అయినా నేను చెప్పేదానిలో ఏవైనా తప్పులుంటే తుకారామ్ మహారాజ్‌వలె అందరిని క్షమించమని ప్రార్థించుచున్నాను.''

ఆమహారాజ్ 'అభంగ్' ఛందస్సులో నిట్లు నుడివియున్నాడు—

"ఓ పాండురంగా! మానవుడు ఈ సంసారసముద్రములో మునిగి పోవుచుండగా చూడలేకుండా ఉన్నాను. నా హృదయము ఆవేదనతో కుంగిపోవుచున్నది. ప్రపంచములో అంతట భగవానుడు ఉన్నాడని తెలిసికూడ నిందించడము అలవాటు అయిపోయినది. ఈ ప్రపంచము మృత్యుముఖములోనికి చొచ్చుకుపోవుచుండగా చూచి కనికరింప కుండా ఉండలేకపోవుచున్నాను. అందుచే ఆడంబరమును, దంభమును బయటపెట్టితే కొందరికి కష్టముగా నుండును. వారు నన్ను దుర్మార్గు డని, నాస్తికుడని అనుకోవచ్చు. వారి నందరిని క్షమించమని ప్రార్థించుచున్నాను.''

భక్తుల సమక్షమున ఇద్దరు స్వాములవార్లమధ్య జరిగిన సంభాషణలో శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానందస్వామివారిని అనుమానములను తీర్చుచు కొన్నిమాటలు చెప్పుడని కోరేవారు.

కాని ప్రకాశానందస్వామివారు "మాట మూట నాకేమి తెలియదు" అని తప్పించుకొనేటందుకు ప్రయత్నించేవారు. కాని చాలాపట్టు పట్టితే ఏవో రెండుముక్కలు చెప్పేవారు. అట్టి సంభాషణలే ఈ 'వార్తాలాప' గ్రంథమున శ్రీ ప్రకాశానందస్వామివారిపేర పొందుపరచబడినవి. ఇందు 35 ప్రసంగములు కలవు. ఇవి వినోదసంభాషణలో అవతరించినందున అందరికి సుబోధమగునట్లు సులభభాషలో వ్రాయబడినవి. అందుచే శబ్దదోషములు అర్థదోషములు ఉండుట సహజము. పాఠకులు వాటిని మన్నింతురుగాక! విషయ ప్రాధాన్యమును బట్టి ఈ గ్రంథము అమూల్యమని వారు గ్రహింపగలరని నమ్ముచున్నాము.

హరిః ఓం తత్సత్

ఇట్లు
ప్రకాశకులు.

—X—

# ఉపోద్ఘాతము

*ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే,*
*పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥*
*ఓమ్ శాంతిః శాంతిః శాంతిః॥*

ఆ పరోక్షము పూర్ణము. ఈ ప్రత్యక్షము పూర్ణము. పూర్ణము నుండి పూర్ణము జన్మించినది. పూర్ణమునుండి పూర్ణమును గ్రహించి నను పూర్ణమే శేషించును.

ఓం శాంతి (లభించుగాక!) శాంతి (లభించుగాక!) శాంతి (లభించుగాక!) (శ్రీ ప్రకాశానందస్వామివారి వచనములు):—

ఈ ప్రపంచములో ప్రతిప్రాణి సుఖమును కోరును. దుఃఖమును కోరదు. కొందరికి స్త్రీయందు సుఖము లభించును. మరికొందరికి సంతానమందు అది లభించును. కొందరు ధనమువల్ల సుఖము కలుగు నను కొందురు. మరికొందరు కీర్తివల్ల అది కలుగు ననుకొందురు. ఇట్లు సుఖప్రాప్తివిషయమున మనిషికి మనిషికి అభిప్రాయములు వేర్వేరుగా నుండును. వాస్తవమైన సుఖమేమిటో తెలిసినవారు చాలా అరుదు. గీతయందు భగవానుడు మూడు రకముల్తెన సుఖములను వివరించియున్నాడు:—

*యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్,*
*తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్॥*

"ఆరంభమున విషమువలెనుండి విపాకమునందు అమృతము వలెనుండు ఆత్మబుద్ధిచే లభించిన సుఖము 'సాత్త్వికసుఖ' మనబడును."

శమదమాది సాధనములను అభ్యసించే సమయమున మిక్కిలి శ్రమపడవలసియుండును. అందుచేత ఆరంభములో విషమువలె అతి క్లేశకారిగా ఉండును. యోగవాసిష్ఠములో ఇట్లు చెప్పబడినది:—

*అప్యబ్ధిపానాన్మహతః సుమేరూన్మూలనాదపి,*
*అపి వహ్న్యశనాత్ సాధో! విషమశ్చిత్తనిగ్రహః॥*

"ఓ రామా! మహాసముద్రమును పానముచేయుటకంటెను, సుమేరుపర్వతమును ఊడపీకుటకంటెను, అగ్నిని భుజించుటకంటెను కూడా మనోనిగ్రహము మిక్కిలి కష్టమైనది."

కాని విపాకావస్థలో అనగా నిర్వికల్పసమాధికాలములో లభించు సుఖము వర్ణనాతీతము. అది అమృతముతో సమానమైనది. కార్యరూపములగు రజస్తమస్సుల మిశ్రణములేని శుద్ధసత్త్వపూర్ణమైన నిర్మలోదకమువంటిది ఆ యవస్థ. ఆ విశుద్ధావస్థాజన్యమైనసుఖము ఆత్మబుద్ధిప్రసాదమున పుట్టునది. శ్రుతియందు ఇట్లు చెప్పబడినది:—

*సమాధినిర్ధూతమలస్య చేతసో నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్,*
*న శక్యతే వర్ణయితుం గిరా తదా స్వయం తదన్తఃకరణేన గృహ్యతే॥*

సమాధియందు రజోగుణము తమోగుణము అనే మలినములను లేకుండజేసి మనస్సును ఆత్మనిష్ఠముగా చేసిన మానవుడు సమాధి సమయమున పొందే సుఖము వర్ణింప శక్యముకాదు. అంతఃకరణము ద్వారా తాను స్వయముగా ననుభవించతగినది మాత్రమే.

అనగా ధ్యానయోగనిరతుడై యుండగా జీవ, బ్రహ్మల మధ్యనుండు ఆవరణము తొలగినవెంటనే శుద్ధసత్త్వప్రధానమగు బ్రహ్మాకారవృత్తియందు బ్రహ్మము ప్రతిబింబించును. అప్పుడు అనుభూయమానమగు సుఖము సాత్త్వికము, నిర్వికల్పసమాధిద్వారా కలుగును.

నిర్వికల్పసమాధి రెండు రకములు. 1. అద్వైతభావనారూపము, 2. అద్వైతావస్థానరూపము. త్రిపుటీరహితమైన కేవల బ్రహ్మాకారమగు వృత్తి కలిగినచో అది అద్వైతభావనారూపసమాధి. అప్పటినుండి సత్త్వగుణము అస్తిత్వమును కలిగియుండును. సత్త్వగుణము స్వస్వరూపావస్థయందు లయమునొందినచో అద్వైతావస్థాన

రూపమను నిర్వికల్పసమాధి యనిపించుకొనును. అదియే గుణాతీతావస్థ. దీనియందు ఆద్యన్తపరిచ్ఛేదరహితమైన త్రైకాలికసుఖము కలుగును.

*విషయేన్ద్రియసంయోగాద్యత్తదగ్రేఽమృతోపమమ్ ।*
*పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥*

"విషయమునకు ఇంద్రియమునకు సంయోగమువల్ల నుద్భవించి ఆరంభమున అమృతోపమమై, విపాకమున విషమువలెనుండు సుఖము 'రాజససుఖము' అనబడును."

విషయేంద్రియసంయోగమువలన కలుగు సుఖము ఆరంభమునందు అనగా ప్రథమక్షణమునందు అమృతమువలె నుండును. కాని వెంటనే బలము, వీర్యము, ప్రజ్ఞ, మేధ, ధర్మార్థకామమోక్షములను చతుర్విధపురుషార్థములు—వీనియందు ఉత్సాహము నశించుటవల్లను, అధర్మము, తజ్జన్యనరకాదులు—వీనివల్లనున్ను పరిణామమునందు అనగా సుఖానుభవసమాప్తి అయినవెంటనే విషఫలము నిచ్చును. ఆ సుఖము రాజససుఖము.

*యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః ।*
*నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥*

"ఆరంభమునందును, పరిణామమందును బుద్ధిని (అంతఃకరణమును) మోసపుచ్చునదియు, నిద్ర, సోమరితనము, పొరపాటు—వీనివల్ల కలుగునట్టిదియు నగు సుఖము 'తామససుఖము, అనబడును."

అపేయపానము, అభక్ష్యభక్షణము, హింస, చౌర్యము మున్నగువానివలనను, నిద్రవలనను అనుభవించు సుఖము తామససుఖము. దీనికి ఆరంభమునందును అంతమునందును కూడ మానవుడు ఆత్మప్రాప్తియొక్క మార్గమును మరచిపోవును. బ్రహ్మసుఖప్రాప్తితో సర్వదుఃఖనివృత్తి కలుగును. ఇదియే మోక్షమనబడును.

న మోక్షో నభసః పృష్ఠే న పాతాలే న భూతలే।
అజ్ఞానహృదయగ్రన్థేర్నాశో మోక్ష ఇతి స్మృతః॥

"ఆకాశమునందు మోక్షము లేదు. పాతాళమునందును అది లేదు. భూతలమందును అది లేదు. హృదయమందలి అజ్ఞానగ్రంథి యొక్క నాశమే మోక్షమనబడును."

దుఃఖనివృత్తి, సుఖప్రాప్తి మోక్షమునకు అర్థము. అట్లు జీవించువ్యక్తి జీవన్ముక్తుడు. శ్రుతి యిట్లు చెప్పుచున్నది:—

యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది స్థితాః।
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే॥

"ఎవని బుద్ధియందలి కామములన్నియు నశించునో ఆ మనుష్యుడు మృత్యువునకు అతీతుడగును. ఆతడు ఇచ్చటనే బ్రహ్మను పొందును."

బ్రహ్మవేత్తలకు, బోధకుపూర్వము శరీరధారణకై కలుగు అన్నపానాదిప్రవృత్తులకు కారణభూతమగు ఇచ్ఛకు భిన్నములైన ఐహిక పారలౌకిక కాంక్షలు నశించును. వెంటనే బోధానంతరము మరణశీలుడగు ముముక్షువు అవిద్యా—కామ కార్యమగు మృత్యువు—నశించుటవలనను, అన్యలోకగమనమునకు కారణమగు మృత్యువు నశించుటవలనను మృత్యురహితుడగును. గమనాభావమున ఈశరీరమునందే సర్వబంధనివృత్తి నొంది బ్రహ్మసుఖము ననుభవించును.

వేదధర్మమునందు మరణానంతరమే మోక్షము అని అంగీకరించబడలేదు. శాస్త్రములు పుణ్యాపాపములకు ఫలము స్వర్గనరకము లని చెప్పుచున్నవి. పుణ్యఫలానుభవానంతరము మర్త్యలోకమునకు తిరిగి రావలసినదే.

"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి."

ఈకాలమున కొందరు 'స్వర్గము, నరకము, బంధమోక్షాదులు సత్యములు కావు. నలుగురిని వలలో వేసికొనడానికి పన్నిన పన్నాగములుమాత్రమే' అని అందురు. ఇది తప్పు.

ఇట్టి సందేహము పరోక్షములగు స్వర్గాదులయందు ఒకప్పుడు జనింపవచ్చునేమో గాని ప్రత్యక్షమగు మోక్షము విషయమున మాత్రము జనింపనేరదు. మోక్షము ఈశరీరమునందే లభించును. కావున దానిని ప్రత్యక్షము కావించుకొనవలెను.

వేదశాస్త్రములయందు చెప్పబడినప్రకారము ఏకాంతముగా కూర్చొని అభ్యాసము చేసినచో దీని యథార్థత బోధపడును. తగినంత పురుషప్రయత్నము చేసి అనుభవించనంతవరకు అది కేవలము అభూతకల్పనవలె కాన్పించును. కావున మానవుడు నమ్మడు. సాంఖ్య సూత్రమున నిట్లు చెప్పబడినది:—

నాన్ధదృష్ట్యా చక్షుష్మతా మనుపలమ్భః।

“అంధునకు వస్తువు కన్పించనిచో కండ్లుకలవాని కది కన్పించకపోదు.”

విజ్ఞానవేత్తలు మరియొక దృక్పథమును కలిగియున్నారు. వారి విజ్ఞానమున 'పరమాత్మ' యను వస్తువు లేనేలేదు. కావున పరమాత్మను ఇంద్రియములద్వారా శోధించుట వీరి కెట్లు వీలగును? జాతి గుణ క్రియా సంబంధములు కల సావయవపదార్థములే ఇంద్రియ విషయములు. పరమాత్మ అట్టిది కానందున ఇంద్రియములద్వారా ఎట్లు గ్రహింపబడును?

పరమాత్మ బుద్ధిగ్రాహ్యము. భగవానుడు గీతయందు దానిని “బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియమ్” అని చెప్పియున్నాడు. బుద్ధిచే బ్రహ్మతత్త్వము గ్రహించబడును. ఇంద్రియములద్వారా కాదు. ఇంద్రియ

విషయము కానట్టిదియు, బుద్ధిచేమాత్రమే అనుభవించబడునదియును నిరతిశయ బ్రహ్మసుఖము.

'అతీన్ద్రియమ్' అనగా నేత్రాదీంద్రియజన్యజ్ఞానమునకు విషయముకానిది. రజోగుణ తమోగుణ రహితమగు బుద్ధిద్వారా అనుభవించదగినది. ఈబ్రహ్మసుఖము కేవలము బుద్ధిగ్రాహ్యము.

అసంప్రజ్ఞాతసమాధియందు బుద్ధియొక్క వృత్తిమాత్రము లయమును పొందును. బుద్ధి లయమును పొందదు. కావున ఆసుఖమును బుద్ధి అనుభవింపగలదు. అందుచే బ్రహ్మసుఖము బుద్ధిగ్రాహ్యమనుట నిస్సంశయము. ముండకోపనిషత్తునందు బ్రహ్మసుఖము బుద్ధిగ్రాహ్యమనునది యిట్లు వివరింపబడినది:—

*న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవై స్తపసా కర్మణా వా।*
*జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వ స్తతస్తు తం పశ్యతి నిష్కలం ధ్యాయమానః॥*

"ఆ బ్రహ్మసుఖము నేత్రగ్రాహ్యము కాదు. వాక్కుచే గ్రహించబడదు. ఇతరేంద్రియములకు గూడ లోబడదు. తపస్సువలనను, కర్మవలనను గూడ నది కలుగదు. జ్ఞానముచే నిర్మలాంతఃకరణము నొందిన యోగి బ్రహ్మసాక్షాత్కారమునకు యోగ్యుడగును. ఆతడే ధ్యానము చేయుచు కళారహితుడగు బ్రహ్మను పొందును."

బ్రహ్మమునకు రూపములేదు. కావున నేత్రములు గ్రహించలేవు. జాతిగుణక్రియలచే పరిచ్ఛిన్నము కాదు. అందుచే వాక్కునకు విషయము కాదు. ఇటులనే ఇతరేంద్రియములకును అగోచరము. అంతేకాదు. కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సులవలనగాని, అగ్నిహోత్రాది కర్మల ఫలరూపమునగాని అది లభించదు. ఏలనన, అది ఆత్మస్వరూపము. మట్టినుండి ఘటము పుట్టునట్లు అది దేనినుండియు పుట్టునది కాదు. ఉత్పాద్యము నశ్వరము కదా! ఆత్మ స్వరూపము నశ్వరము కాదే! పెరుగు పాలయొక్క వికారమగునట్లు ఆత్మస్వరూ

పము మరియొక వస్తువుయొక్క వికారము కాదు. మోక్షము బ్రహ్మ స్వరూపము. బ్రహ్మమునకు అవస్థాంతరము లేదు. ఒక గ్రామము నకు ప్రయాణము చేయువానికి ఆగ్రామము చేరుటతోడనే అది లభించును. అట్లు మోక్షము లభించదు. బ్రహ్మ సర్వవ్యాపకము. కావున అది అందరికి అన్నిచోట్ల ఎల్లప్పుడు పొందనగును. మోక్షము సంస్కార్యమును కాదు. సంస్కారము రెండు విధములు. 1. గుణాధాన సంస్కారము, 2. దోషాపనయన సంస్కారము. ఫలవృక్షాదులకు ఎరువువేసి మంచిపంటలను పొందుదుము. ఇది గుణాధాన సంస్కారము. మురికిగల అద్దమున ప్రతిబింబము కాన్పించదు. ఆమురికిని తుడిచివేసిన ప్రతిబింబము కాన్పించును. ఇది దోషాపనయన సంస్కారము. ఈ రెండు సంస్కారములు బ్రహ్మమునందు సంభవింపవు. కావున అది కర్మచే లభించదు. నిర్మలము ప్రశాంతము నగు బుద్ధికి మాత్రమే బ్రహ్మానుభవము కలుగును. ధ్యానము బ్రహ్మానుభవము నకు పరంపరాగతమగు కారణము. సమాధి సాక్షాత్కారణము. బ్రహ్మానుభవము, అనగా బ్రహ్మానందము, బుద్ధిగ్రాహ్యము.

"మనసైవానుద్రష్టవ్యమ్" ఇత్యాది శ్రుతులు కూడ బ్రహ్మతత్త్వము బుద్ధిగ్రాహ్యమని చెప్పుచున్నవి. మనస్సుద్వారా, అనగా బుద్ధిద్వారా, బ్రహ్మతత్త్వమును తెలిసికొనవలెనని దాని యర్థము. ఇట్లు గీతాదిస్మృతులు శ్రుతులుకూడ బ్రహ్మతత్త్వము బుద్ధిగ్రాహ్యమనుటను నిర్ధారణచేసినవి.

కాని, తైత్తరీయోపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది :—

యతోవాచో నివర్తన్తే అప్రాప్య మనసాసహ ।

వాక్కు మనస్సు కూడ ఆబ్రహ్మమును విషయమునుగా చేసికొనలేక వెనుకకు మరలును అని దాని యర్థము. ఈశ్రుతినిబట్టి బ్రహ్మ మనస్సునకు విషయముకాదనుట సుస్పష్టము. అందుచే "బుద్ధిగ్రాహ్యమ్"

అనునది ఈశ్రుతికి విరుద్ధమగును. అంతే కాదు. యుక్తికి కూడ అది విరుద్ధమే.

అంతఃకరణము బ్రహ్మావిషయమున జడము. జడమునకు చైతన్యము విషయము కాదు. కావున బ్రహ్మము బుద్ధిగ్రాహ్యామనుటలో వ్యాఘాతదోషము కలుగును. ఆదోషము పట్టకుండుటకు అంతఃకరణముద్వారా ఆత్మజ్ఞానము ఆత్మకే కలుగునని చెప్పినచో 'ఆత్మాశ్రయ' దోషము పట్టును. అద్దమునందు తనముఖమును తాను చూచునట్లు అంతఃకరణముద్వారా ఆత్మ ఆత్మను చూచును అని చెప్పవచ్చును. కాని, అద్దములో తాను తన ముఖమును చూచుట వాస్తవము కాదు. అచ్చట బింబము ప్రతిబింబమును చూచును. బింబము బింబమును చూడలేదు. కావున అంతఃకరణముద్వారా ఆత్మజ్ఞానము ఆత్మకు కలుగదు. ఆత్మ, అంతఃకరణము ఒకరి నొకరు తెలిసికొనగలరని చెప్పినచో 'అన్యోన్యాశ్రయ' దోషము కలుగును. ఈదోషమును పరిహరించుటకు ఆత్మ, అంతఃకరణముల మధ్య చిదాభాసమను మూడవదానిని అంగీకరించినచో 'చక్రిక' దోషము పట్టును. చిదాభాసము తన అస్తిత్వమునకు అంతఃకరణము నపేక్షించును. అంతఃకరణము స్వాధిష్ఠానమగు కూటస్థుని అపేక్షించును. కూటస్థుడు తన ప్రకాశమునకు చిదాభాసము నపేక్షించును. ఇట్లు చిదాభాసము అంతఃకరణమును, అంతఃకరణము కూటస్థుని, కూటస్థుడు చిదాభాసమును అపేక్షించుటలో'చక్రిక' దోషము కలుగును. దీనిని నివారించుటకు ప్రయత్నించిన 'అనవస్థాదోషము' పట్టును. కావున 'బుద్ధిగ్రాహ్యమ్' అనునది యుక్తివిరుద్ధ మగుచున్నది. ఇందుకు సమాధానమిది :—

ఆవరణభంగరూపమగు వృత్తికిమాత్రమే బ్రహ్మము విషయము. చిదాభాసరూపమగు ఫలమునకు బ్రహ్మము విషయము

కాదు. బ్రహ్మము మనోగోచరము అని చెప్పిన తావులలో అనగా "మనసైవాను ద్రష్టవ్యమ్", "బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్" ఇత్యాదిస్థలములో కేవలము వృత్తినిమాత్రమే గ్రహించవలెను. బ్రహ్మము మనోగోచరము కాదు అని చెప్పిన తావులలో అనగా "యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ" ఇత్యాదిస్థలములలో చిదాభాసరూపమగుఫలము నిషేధించబడినట్లు తెలిసికొనవలెను. ఇట్లు వ్యవస్థ చేయుటలో శ్రుతిస్మృతులకు ఐకకంఠ్యము సిద్ధించి యుక్తివిరోధము తొలగును. బ్రహ్మజ్ఞానమునకు బుద్ధియే ఏకైకసాధనమని శ్రుతియే వక్కాణించుచున్నది.

దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః ।

"సూక్ష్మదర్శనమ్ముకలవారిచే సూక్ష్మబుద్ధిచే, అనగా ఏకాగ్రతగల బుద్ధిచే, ఆబ్రహ్మము చూడబడును."

ఈశ్రుతిని ప్రమాణముగా తీసికొని అతద్వ్యావృత్తిచే అంతఃకరణముద్వారా బ్రహ్మానుభవము పొందనగును. అతద్వ్యావృత్తి అనగా ఉపాధుల నన్నిటిని నిషేధించి ఆత్మానుభవమును పొందుట. అతద్వ్యావృత్తి యనగా నేమియో ఈక్రింది దృష్టాంతమువలన బోధపడును.

శ్రీరాముడు దండకారణ్యమునకు వెళ్లినపుడు ఋషులు, వారి భార్యలు ఆయనచుట్టు చేరిరి. రామలక్ష్మణు లిద్దరు ఋషులతోను, సతి వారి భార్యలతోను కలిసి ఆశ్రమమునకు వచ్చిరి. అచ్చట పురుషసమూహమున కెదురుగా స్త్రీసమూహము కూర్చొనెను. రామలక్ష్మణులు జటావల్కలధారులగుటచే ఋషులలో కలిసిపోయిరి. అంతట ఒకఋషిస్త్రీ అచ్చటికి వచ్చెను. ఆమెకు రాముని చూడవలెనని ఉబలాట కలిగెను. ఆమె వెరిగా ఋషిభార్యల సమూహమున సీతను గాంచి 'రాము డెక్కడ' అని యడిగెను. సీత కులవధువుగాన

ప్రత్యుత్తరము నీయలేదు. అప్పు డొకవృద్ధురాలు 'అట్లు అడుగ రాదుసుమా' అని ఆఋషిస్త్రీని మందలించెను. కాని ఆమె కొందరు ఋషులను వ్రేలుతో జూపుచు 'ఇతేడు రాముడా, ఇతేడు రాముడా' అని తిరిగ సీతను అడిగెను. 'కాదు, కాదు' అని సీత సమాధాన మిచ్చెను. అప్పుడు ఆమె లక్ష్మణుని వ్రేలుతో జూపి 'ఆగౌరమూర్తి రాముడా' యని సీతను ప్రశ్నించెను. 'కాదు, అతడు నామరది' అని సీత జవాబిచ్చెను. మరల ఆమె 'అతనిప్రక్కన కూర్చొని యున్న ఆఘనశ్యాముడు రాముడా' అని యడిగెను. సీత ఆ విగ్రహమును చూచి తన దృష్టిని క్రిందికి మరల్చెను. అంతట ఆఋషిభార్య ఆతడే రాముడని తెలిసికొనగల్గెను.

ఇట్లు ఈ అతద్వ్యావృత్తిలక్షణమున గ్రాహ్యమగు సాక్షి స్వరూపుడగు ఆత్మనుగురించి శ్రుతి యిట్లు వక్కాణించుచున్నది–

స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతే ।

'నేతి, నేతి' అను పద్ధతిని ఉపాధుల నన్నిటిని నిషేధించుటద్వారా చివరకు తేలునది ప్రత్యగాత్మ. అది కార్యధర్మమునకు పరమైనందున ఇంద్రియవిషయము కాదు. అనగా ఇంద్రియములద్వారా గ్రహించబడదు.

కావున నాస్తికవాదము చేయక, వేదములందును, బ్రహ్మవేత్తల వచనములందును శ్రద్ధనుంచి, అభ్యాసముచేసి, వారివలె ఆచరణము కలిగియుండిన వానికి తప్పక బ్రహ్మానుభవము కలుగును.

భర్తృహరి యిట్లు నుడివెను–

యత్స్వాదాద్విరసా భవంతి విభవా స్త్రైలోక్యరాజ్యాదయః ।

"బ్రహ్మసుఖము ననుభవించినవానికి త్రైలోక్యరాజ్యాధిపత్యము మున్నగు వైభవము లన్నియు రసహీనములుగా తోచును."

వైరాగ్యమునొంది మాయాసుఖముల నన్నిటిని పరిత్యజించి సాధనసంపన్ను డయినచో మోక్షసుఖమును ఈజన్మలోనే యనుభవించును. కానిచో గీతలో భగవానుడు అర్జునునకు చెప్పిన **"యథేచ్ఛసి తథాకురు"** అను సమాధానమే శరణ్యము. శాస్త్రవేత్తలచే రెండే రెండు మార్గములు చెప్పబడినవి.

*"మోక్షో విషయవైరస్యం బన్ధో వైషయికో రస: ।*
*ఏతావదేవ విజ్ఞానం యథేచ్ఛసి తథాకురు॥*

"మోక్షమనగా విషయాదులయందు వైరస్యము. బంధమనగా విషయాదులయందు ప్రీతి. విజ్ఞాన మింతమాత్రమే. దీనిని గ్రహించి నీకు ఎట్లు తోచిన అట్లు చేయుము."

*ఓమ్ అప్యాయన్తు మమాఙ్గాని వాక్ప్రాణశ్చక్షు: శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ, సర్వాణి సర్వం బ్రహ్మోపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు; తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు, తే మయి సన్తు, ఓమ్ శాన్తి: శాన్తి: శాన్తి:॥*

"నా అంగములు తృప్తిని పొందుగాక! వాక్కు, ఘ్రాణము, చక్షువు, శ్రోత్రము, బలము (అంతఃకరణము) అన్ని ఇంద్రియములు తృప్తిని పొందుగాక! ఉపనిషత్తులచే పొందదగు బ్రహ్మ సర్వవ్యాపి, నే నాబ్రహ్మను విడనాడను. బ్రహ్మ నన్ను విడనాడకుండుగాక! అనిరాకరణ ముండుగాక! నాకు అనిరాకరణ ముండుగాక! ఆత్మాసక్తుడనైన నాయందు ఉపనిషత్తులందలి ధర్మములు ఉండుగాక! నాయందుండుగాక !!

ఓమ్ శాంతి (యగుగాక !) శాంతి (యగుగాక!) శాంతి (యగుగాక!)